# తలుపు

తమిళమూలం సుబ్రహ్మణ్య భారతి
తెలుగుసేత చల్లా రాధాకృష్ణ శర్మ



*'నేనే తలుపును' అన్నాడు ప్రేమస్వరూపుడైన క్రీస్తు భగవానుడు. అంటే ప్రేమయే తలుపు. సంతోషం, ఆనందం పొందదలుచుకొన్న ప్రతి వ్యక్తీ తానే అయిన ఆ తలుపును బాగా తెరుచుకోవాలి.*

---

**పూర్వం** ఒక రాజాగారు ఉండేవారు. ఆయన ఒకనాడు తన మంత్రిని "మూలం ఏది?" అని అడిగాడు. మంత్రి ఆలోచనలో పడ్డాడు. రాజాగారు దేని మూలం అడుగుతున్నదీ ఎంత తల పగులగొట్టుకున్నా మంత్రికి తెలియలేదు. కొంచెం తెలిసేటట్టు చెప్పండి— అని రాజాగారిని అడగకూడదు, అలా అడిగితే, ఆయనకు కోపం వస్తుంది. ఎంతో మెలకువగా ఆయనవద్ద సంచరించాలి. అందువల్ల మంత్రి "సమాధానం రేపు చెబుతాను" అని రాజాగారివద్ద సెలవు తీసికొని యింటికి వెళ్లాడు.

ఆ రాత్రి భోజనంకూడా మానివేసి, కూర్చున్నవాడు కూర్చున్నట్టే మంత్రి ఆలోచనలో మునిగిపోయాడు. మంత్రి భార్య యింతలో ఒక బంగారు గిన్నెలో పాలూ అన్నం కలిపి తీసుకువచ్చింది. రెండు జామపళ్ళుకూడా తీసుకువచ్చింది. వాటిని కన్నెత్తి అయినా చూడకుండా మంత్రి ఆలోచన చేస్తూనే ఉన్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు యింత దీర్ఘంగా?" అని అడిగింది భార్య.

"రాజాగారు ఒక ప్రశ్న అడిగారు. దానికి, ఏం సమాధానం చెప్పాలో తెలీక సతమతమై పోతున్నాను" అన్నాడు మంత్రి నీరసంగా.

"ఏమిటండీ ఆ ప్రశ్న?"

"మూలం ఏది?" అని రాజాగారు వేసిన ప్రశ్నను మంత్రి చెప్పాడు.

"దేని మూలం?"

"ఆ సంగతి రాజాగారు చెప్పలేదు" అన్నాడు మంత్రి.

అప్పుడు మంత్రి భార్య "లోకానికి మూలం ఓంకారం" అని చెప్పింది.

"అలాగా!" అన్నాడు మంత్రి. అప్పుడు సంతోషంకొద్దీ భోజనం చేశాడు. ఆ రాత్రి ఆయనకు నిద్రకూడా బాగా పట్టింది.

ఆ మరునాడు మంత్రి రాజాగారిని దర్శించి



ఎడారిలో బిడారి ఓడ    ఫోటో—ఎల్. ఆర్. గ్రోవర్ (రోహతక్)

"లోకానికి మూలం ఓంకారం" అని చెప్పాడు.

"ఓం అంటే ఏమిటి?" అని రాజాగారు మరో ప్రశ్న వేశాడు.

"అది పర్ర్యబహ్మ స్వరూపానికి యింకో పేరు" అని మంత్రి తడుముకోకుండా జవాబు చెప్పాడు.

"బాగానే ఉంది. ఓం అనే మంత్రాన్ని మొట్టమొదట ఉచ్చరించింది యెవరు?" అని రాజాగారు అడిగాడు.

'ఏమిటి ప్రశ్న! వెర్రిబాగులవాడు అడిగి నట్టుంది గాని, తెలివితేటలుగల రాజాగారు అడిగినట్టు లేదే యీ ప్రశ్న! ఓం అనే మంత్రాన్ని మొదట ఎవరు ఉచ్చరించారో! ఎవరు చూశారని! ఈ మూర్ఖుడు ఇటువంటి వెర్రిమొర్రి ప్రశ్నలతో నన్ను రోజూ చంపుకు తింటున్నాడు. దీనికేం జవాబు చెప్పాలి?' ఇలా తనలో తాననుకున్నాడు మంత్రి. చివరికి, వెటకటమాదిరిగా "రేపు చెబుతాను జవాబు" అంటూ మంత్రి రాజాగారివద్ద అనుజ్ఞ తీసికొని యింటికి వెళ్లాడు.

రాజాగారి ప్రశ్నను భార్యకు తెలియజేసి "ఇప్పుడేం సమాధానం చెప్పాలి" అని అడిగాడు మంత్రి.

అప్పు డామె యిలా అన్నది:

"మన పట్టణానికి పడమరగా రెండు కోసుల దూరంలో ఒక కొండ ఉన్నది. ఆ కొండలో ఒక గుహ ఉన్నది. అందులో మౌన

# తలుపు

స్వామి అనే పరదేశి ఒకాయన ఉన్నాడు. ఆయన్ని కనుక అడిగితే, సమాధానం నేలమీద వ్రాసి చూపిస్తాడు."

ఆ మరునాడు తెల్లవారిందో లేదో, పల్లకిలో మంత్రి కొండ దగ్గరికి వెళ్లాడు. మౌనస్వామిని దర్శించి "ఓం అనే మంత్రాన్ని కనిపెట్టిందెవరు, స్వామీ?" అని అడిగాడు భయభక్తులు ప్రకటిస్తూ.

మౌనస్వామి యిలా నేలమీద వ్రాశాడు:

"ఈ మంత్రాన్ని మొట్టమొదట పరాశక్తి పరమశివుడికి ఉపదేశించింది. ఆ మంత్రం చిహ్నమే వినాయకుడు. మౌనందాల్చి వినాయకుడిని ధ్యానిస్తూ, శక్తిని ఉపాసించేవారికి ఆ వినాయకుడే ఓంకారం తెలియజేస్తాడు. ఇది చాలా ప్రాచీనమైనది."

ఈ విషయాన్ని ఒక తాటాకుమీద వ్రాసుకొని రాజాగారివద్దకు వెళ్లాడు మంత్రి.

ఆ తర్వాత, మౌనస్వామిని సందర్శించి ఆయనవల్ల మరికొన్ని విషయాలు తెలుసుకోవాలనే ఆశ రాజాగారికి కలిగింది. మంత్రిని వెంట బెట్టుకుని ఆయన ఆ కొండదగ్గరికి వెళ్లాడు.

మౌనస్వామిని రాజాగారు "మూలం ఏది?" అని అడిగాడు. అప్పుడు మౌనస్వామి 'సమాధానం చెప్పవయ్యా' అన్నట్టుగా మంత్రి వైపు చూశాడు.

"ఈ లోకానికంతా ఓంకారమే మూలం"— అని మంత్రి చెప్పడం మొదలుపెట్టాడు.

"నేనడిగింది మిమ్మల్ని కాదు. మీరు పూరికే ఉండండి. స్వాములవారు చెప్పగా కొన్ని విషయాలను వినాలని నాకు ఆశగా ఉన్నది" అన్నాను రాజా.

అప్పుడు మౌనస్వామి నేలమీద యిలా వ్రాశాడు:

"ఓంకారమే సృష్టికి మూలం. ఓంకారం ప్రేమపూరితం. స్త్రీ పురుషుల మధ్య ఉండే సంబంధమే ప్రేమ అంటేను. ఈ సంబంధం వల్లనే సృష్టి జరుగుతోంది. సామాన్య మనుష్య వ్యాపారమనే భావంతో ప్రేమించేవారు నిజానికి మనుషులు కారు. అది ఎంతో పవిత్రమైనది. అది ఆత్మకు సంబంధించింది. తన భార్య శక్తిస్వరూపిణి అని, తన ఆకృతి అని భావించి ప్రేమించాలి. ఇటువంటి జ్ఞానానికే ప్రేమ అని పేరు. ఏసుక్రీస్తు ప్రేమమూర్తిగా అవతరించాడు. ఆయన ఒకసారి అన్నాడుగదా— 'నేనే తలుపును' — అని. అనగా ప్రేమయే తలుపు. దాన్ని కనుక తెరవగలిగితే, అప్పుడు మోక్షం అనే యింట్లోకి మనం వెళ్లవచ్చు."

ఈ లోకంలో సంతోషం, ఆనందం పొందదలుచుకున్న ప్రతి వ్యక్తి తానే ఆయిన ఆ తలుపును బాగా తెరుచుకోవాలి; ప్రేమ స్వరూపుడై ఉండాలి.

ఇదే ఈ కథలోని భావం.

పరాశక్తియే మనకు దిక్కు! ★